

రంజాన్ వేళలు
ఇఫ్తార్ - శుక్రవారం
సాయంత్రం - 6:36
సహర్ - శనివారం
ఉదయం - 4:45

రాజకీయ వేడి



లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయ వేడి రగులుకుంటోంది. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు క్షేత్ర స్థాయిల్లో ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. ఇప్పటికే ఈ పార్టీలు చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాల అభ్యర్థులను ఖరారు చేసి ప్రచారపర్వాన్ని ప్రారంభించాయి. ఎన్నికలకు ఇంకా నెల రోజులకుపైగా సమయం ఉన్నా ఇప్పటి నుంచే అగ్రనేతలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఇక్కడ ఈ మూడు పార్టీల మధ్య పోటీ నువ్వా నేనా అన్న రీతిలో ఉంటుందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. చేవెళ్ల, మాల్కాజిగిరి స్థానాల్లో గెలిచేందుకు పార్టీలు తమ శక్తి యుక్తులన్నీ కేంద్రీకరిస్తున్నాయి. ఇదిలా ఉంటే భారీ బహిరంగ సభల నిర్వహణకు ఆయా పార్టీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ సభల్లో నేతల ప్రసంగాలతో ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కనుంది.

జాతీయ నేతల రాక

- తుక్కుగూడలో రేపు కాంగ్రెస్ జనజాతర సభ
- 13న చేవెళ్లలో బీఆర్ఎస్ బహిరంగ సభ
- త్వరలో జిల్లాలకు బీజేపీ అగ్రనేతలు
- ఊపందుకుంటున్న 'సార్వత్రిక' ప్రచారం
- చేరికలను ముమ్మరం చేసిన అధికార కాంగ్రెస్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

రెండు నియోజకవర్గాల్లో రసవత్తర పోటీ

లోక్‌సభ ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది. చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో మూడు ప్రధాన పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొనడంతో ఆయా పార్టీల అగ్రనేతలంతా ఇక్కడ ప్రచారంపై దృష్టిసారిస్తున్నారు. ఆయా పార్టీలు క్షేత్రస్థాయిల్లో పోటీపడి ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ఇప్పటికే మల్కాజిగిరి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి తరుఫున ప్రధాని మోదీ రోడ్ షో నిర్వహించిన విషయం తెలిసిందే. ఇక అధికార కాంగ్రెస్ ఈ నెల 6వ తేదీన తుక్కుగూడలో 'జనజాతర' పేరిట సభ నిర్వహిస్తోంది. గతంలో కనీవినీ ఎరుగని రీతిలో సభను విజయవంతం చేయాలని పార్టీ నేతలు శ్రమిస్తున్నారు. ఇదే సభలో కాంగ్రెస్ మేనిఫెస్టోను సైతం విడుదల చేయనున్నారు. పార్టీ జాతీయ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జునఖర్గే తదితర అగ్రనేతలు హాజరుకానున్న ఈ బహిరంగ సభ సక్సెస్‌పై కాంగ్రెస్ భారీ అంచనాలే పెట్టుకుంది. జాతీయ నాయకత్వమంతా హాజరుకానున్న ఈ సభకు పది లక్షల మంది ప్రజలు, కార్యకర్తలు, నాయకులను తరలించేందుకు అధికార పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, క్యాబినెట్ మంత్రులు పలుమార్లు సభ ఏర్పాట్లు పరిశీలించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి నేతలు ఈ కార్యక్రమ ఏర్పాట్ల బాధ్యతలు చూస్తున్నారు. కాగా రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా ఈ నెల 13న లోక్‌సభ నియోజకవర్గ కేంద్రం చేవెళ్లలో భారీ బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు చేస్తోంది. పార్టీ అధినేత కేసీఆర్ ప్రధానవక్తగా హాజరుకానున్న ఈ సభకు భారీ సంఖ్యలో జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యే యాదయ్య బహిరంగ సభ ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఇదిలా ఉంటే మరో పార్టీ బీజేపీ ఇప్పటికే క్షేత్రస్థాయిలో సభలు, శక్తి కేంద్రాల సమన్వయకర్తలతో సమావేశాలు నిర్వహిస్తోంది. నేతలు కార్నర్ మీటింగుల్లో పాల్గొంటున్నారు. ఈ పార్టీ సైతం త్వరలో చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో భారీ బహిరంగ సభకు సన్నాహాలు చేస్తోంది. ఇక ఉమ్మడి జిల్లాలో విస్తరించి ఉన్న మరో లోక్‌సభ నియోజకవర్గం మల్కాజిగిరి. ఇది దేశంలోనే అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం అన్న విషయం అందరికీ తెలిసిందే. అలాగే రాజధాని హైదరాబాద్‌లో అంతర్భాగంగా ఉన్న చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం అన్ని పార్టీలకూ కీలకమే. ఈ రెండు నియోజకవర్గాల్లో పట్టణ జనాభా ఎక్కువ. ఇలాగే కీలకమైన గ్రామీణ ప్రాంతాలూ ఈ నియోజకవర్గాల సొంతం. మల్కాజిగిరి ప్రాంతానికి మినీ ఇండియాగా పేరుంది. వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లక్షలాది మంది ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. వారిలో చాలా మంది ఇక్కడ ఓటు హక్కు కలిగి ఉన్నారు. వారి ఓట్లు కూడా అభ్యర్థులకు కీలకమే!

పోటీలో అభ్యర్థులు.. పార్టీలు తారుమారు!

ఇక చేవెళ్ల నుంచి కాంగ్రెస్ తరఫున సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి బరిలో ఉన్నారు. ఇటీవలే ఆయన బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఇక బీజేపీ తరఫున మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి జడ్పీ మాజీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ పోటీ చేస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు జిల్లా వాసులే కావడం అలాగే రాజకీయంగా జిల్లాతో వారికి ఏళ్ల తరబడి అనుబంధం ఉండడంతో పోటీ నువ్వా.. నేనా అన్న స్థాయిలో ఉంటుందని రాజకీయ పండితులు అంటున్నారు. కాగా కాంగ్రెస్, బీజేపీలు ఓసీ వర్గ నాయకులకు టికెట్ కేటాయిస్తే.. బీఆర్ఎస్ బీసీ నేతకు అవకాశమిచ్చింది. ఈ నియోజకవర్గ ఎన్నికపై రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఇక మల్కాజిగిరి నియోజకవర్గంలోనూ పోటీ మూడు పార్టీల మధ్య తీవ్రంగా ఉంది. పోయిన సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడి నుంచి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహించారు. ఇప్పుడు ఈ స్థానంపై బీజేపీ, బీఆర్ఎస్‌లు కన్నేశాయి. కాంగ్రెస్ నుంచి వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పోటీ చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందు ఆమె బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డి బరిలో ఉన్నారు. బీజేపీ అభ్యర్థి తరఫున ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు భారీ బహిరంగ సభలకు సన్నాహాలు చేస్తున్నాయి.

కేడర్‌ను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ తంటాలు

ఇదిలా ఉంటే ఎన్నికల సమయంలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తల చేరికలను ముమ్మరం చేశాయి. అధికారం కోల్పోయిన నేపథ్యంలో తన కేడర్‌ను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ తంటాలు పడుతోంది. అసెంబ్లీ ఎన్నికల తరువాత ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు, ఇతర ముఖ్యనేతలంతా ఒక్కొక్కరూ పార్టీని వీడుతున్నారు. ఇలా పార్టీని వీడిన ఇద్దరు నేతలు(రంజిత్‌రెడ్డి, సునీతారెడ్డి) కాంగ్రెస్‌లో చేరి ఎంపీ టికెట్లు పొందడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, ఆయన భార్య వికారాబాద్ జడ్పీ చైర్మన్ సునీతారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన కొద్ది రోజులకే వీరికి మల్కాజిగిరి ఎంపీ టికెట్ ఖరారైంది. అలాగే బీఆర్ఎస్ చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన వారం రోజులకే చేవెళ్ల టికెట్ ఖరారు చేశారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, వారి అనుచరులు సైతం కాంగ్రెస్‌లో చేరారు. రానున్న రోజుల్లో జిల్లాలోని మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం బీఆర్ఎస్‌లో గుబులు రేపుతోంది. మరోవైపు క్షేత్రస్థాయిలో ద్వితీయశ్రేణి నేతలు పార్టీ వీడుతుండడంతో కారు పార్టీ నేతల్లో కలవరం రేపుతోంది.

నిప్పుల కుంపటి!

ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లిలో 42.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్/వికారాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 4: మండుతున్న ఎండలతో జనం బేజారవుతున్నారు. ఉదయం 8గంటల నుంచే ఎండ తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇక మధ్యాహ్నం బయట అడుగు పెట్టాలంటే ప్రజలు జంకుతున్నారు. రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రెండు రోజులుగా డిగ్రీల కొద్దీ పెరుగుతున్నాయి. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లిలో 42.5డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లా అల్లాపూర్ వివేకానందనగర్(కూకట్‌పల్లి)లో 41.5 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా తాండూరులో 42.1డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవి మొదట్లోనే ఎండలు ఇంతగా కొడుతోంటే ఈ నెల మొత్తం, మే, జూన్‌లలో మరిన్ని ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే ఆస్కారం కన్పిస్తోంది. ఎప్పటి లాగే ఎండల్లో క్యూములోనింబస్ మేఘాలు ఆవరించి అక్కడక్కడ వర్షాలు కురిస్తే తప్ప వానాకాలం వచ్చే వరకు ఎండల తీవ్రత పెరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.



ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9గంటలకే ఎండ ఉగ్ర రూపం దాల్చుతోంది. రాత్రి తొమ్మిదైనా వేడి తగ్గక ప్రజలు తల్లడిల్లుతున్నారు. ఉదయం పది తరువాత ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఎండలు మరెంత తీవ్రంగా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులు, ఉపాధి కూలీలు పనులకు వెళ్లేందుకు వెనకాడుతున్నారు. మధ్యాహ్నం స్కూళ్ల నుంచి ఇంటికి వెళ్లే సమయాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సూర్య ప్రతాపంతో వికారాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం తాండూరులో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మన్నెగూడలో 42.డిగ్రీలు నమోదైంది. మరో 12 చోట్ల 40 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు కూడా 33.3 డిగ్రీల నుంచి 35.9 డిగ్రీల వరకు నమోదవుతుండడం గమనార్హం. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి

- కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి
- ముగిసిన గ్రామీణ ప్రజల జీవన స్థితిగతులపై తెలంగాణ వర్సిటీ విద్యార్థుల అధ్యయనం

కడ్తాల్, ఏప్రిల్ 4: విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్(సీజీఆర్) చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి, సాయిరెడ్డిగూడెం, జమ్ములబావి తండాలలో ప్రజల జీవన విధానం, ఆర్థిక స్థితిగతులు, ఆచార వ్యవహారాలు, విద్య, వైద్య సదుపాయాలు, వ్యవసాయ రంగంపై తెలంగాణ విశ్వవిద్యాలయం ఆచార్యులు, విద్యార్థులు మూడురోజుల పాటు నిర్వహించిన అధ్యయన కార్యక్రమం గురువారం ముగిసింది. సీజీఆర్ సహకారంతో రూరల్ క్యాంపులో భాగంగా నాలుగు బృందాలుగా ఏర్పడి ఆయా ప్రాంతాల్లో పలు అంశాలపై క్షుణ్ణంగా అధ్యాయనం చేసి పలు విషయాలు తెలుసుకున్నారు. అన్మాస్‌పల్లి సీజీఆర్ ఎర్త్ సెంటర్‌లో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి సంస్థ అధ్యక్షురాలు కోర్వేలు లీలాలక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా అధ్యయనం చేసిన అంశాలకు సంబంధించిన రూపొందించిన ఫొటో ఎగ్జిబిషన్ ప్రదర్శించారు. అధ్యయనంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను లీలా లక్ష్మారెడ్డి అందజేశారు. అనంతరం యూనివర్సిటీ సోషల్‌వర్క్ ప్రధాన ఆచార్యులు డా.రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో లీలా మాట్లాడుతూ విద్యార్థులు గ్రామీణ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు, యువత ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. రాజేశ్వరి మాట్లాడుతూ గ్రామీణ వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. నూతన విధానాలను, ప్రకృతిపరమైన సేంద్రియ పద్ధతులను వివరించారు. సహ ఆచార్యులు డా. యాలాద్రి, డా.రమాదేవి, ఉమామహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్, నగేశ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



క్యాంపులో పాల్గొన్న విద్యార్థులతో లీలా లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 4 : లోకసభ ఎన్నికల్లో భాగంగా ప్రతీ ఒక్కరు విధులు బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులు, ఏఆర్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శశాంక మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో అధికారులు, తమకు కేటాయించిన విధులను నిబద్ధతతో, బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత టీంలు నిర్ణీత సమయంలో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. శిక్షణ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, తప్పనిసరిగా క్యూ ఆర్ కోడ్ ద్వారా హాజరు తీసుకోవాలన్నారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 85 వయస్సు పైబడిన వారిని, దివ్యాంగులను సీడీపీలుగా గుర్తించాలని ఆదేశించారు. లక్ష రూపాయలకు పైగా డబ్బు లావాదేవీలు జరిపితే బ్యాంకర్లు ఖచ్చితంగా వివరాలు తెలియజేయాలన్నారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు, ఎలక్షన్ సూపరింటెండెంట్ సైదులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'పట్నం' వైస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- ఓటింగ్‌లో పాల్గొన్న 16 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పాల్గొని ఓటేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆకుల యాదగిరి(బీఆర్ఎస్)పై తోటి సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాసంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీవో కె.అనంతరెడ్డి హాజరయ్యారు. మొత్తం కౌన్సిల్‌లో 24 మంది కౌన్సిలర్లు ఉండగా.. కాంగ్రెస్ కౌన్సిలర్లకు తోడుగా పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలిసి 16 మంది, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఓటింగ్‌లో పాల్గొని మూజువాణి పద్ధతిలో ఓటు వేశారు. దాంతో వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. కాగా, రెండ్రోజుల ముందే యాదగిరి వైస్‌చైర్మన్ పదవికి రాజీనామా చేసి రాజీనామా పత్రాన్ని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు అందజేశారు. అయినా.. అది ఆమోదం పొందకపోవడంతో అవిశ్వాసం అనివార్యమైంది.



వైస్‌చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, సభ్యులు

గృహ నిర్మాణాలకు జీపీ నీళ్లు!

- గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో సరఫరా
- చోద్యం చూస్తున్న అధికారులు.. మండిపడుతున్న గ్రామస్తులు

చౌదరిగూడ, ఏప్రిల్ 4 : ఒకవైపు మండుతున్న ఎండలు.. మరోవైపు తాగునీటి కటకట. ప్రజల దాహార్తిని తీర్చాల్సిన గ్రామ పంచాయతీ సిబ్బంది.. ప్రభుత్వ బోరు బావి నుంచి గృహ నిర్మాణాల కోసం నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు మండిపడుతున్నారు. నీటి ఎద్దడిని తీర్చాలంటూ పంచాయతీ అధికారులను కోరుతున్నా పట్టించుకోకుండా.. గృహ నిర్మాణాల కొరకు నీటిని అమ్ముకోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని కాసులాబాద్ గ్రామంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టాడు. గురువారం గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్(ట్యాంకర్) ద్వారా ఇంటి నిర్మాణానికి కావాల్సిన నీటిని వినియోగించాడు. అయితే, ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటిపోతుండటంతో గ్రామంలో తాగునీటి ఎద్దడిని తీర్చాల్సిన పంచాయతీ సిబ్బంది.. బోరు నీటిని గ్రామంలో చేపట్టే గృహ నిర్మాణాల కోసం విక్రయించడం ఏమిటని ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం : ఎంపీవో

జీపీకి చెందిన బోరుబావి నుంచి నీటిని ఇతర అవసరాల నిమిత్తం వాడుకుంటే.. గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు నీటిని వినియోగించుకున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా పెళ్లిళ్లు, మరణాలకు సంబంధించి మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నాం. ఇతర అవసరాల కోసం నీటిని వాడుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. గృహ నిర్మాణాల కోసం నీటిని వినియోగించారన్న విషయమై విచారించి తమ సిబ్బందితో పాటు సదరు వ్యక్తిపై చర్యలు తీసుకుంటాం.



గృహ నిర్మాణానికి నీటిని సరఫరా చేస్తున్న పంచాయతీ ట్యాంకర్

సదరం క్యాంపులను వినియోగించుకోవాలి

- డీఆర్డీఏ పీడీ శ్రీలత

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 4 : సదరం క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ ఎల్.శ్రీలత తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటలకు మీసేవ ఆన్‌లైన్ సదరం స్లాట్స్‌ను విడుదల చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. సదరం క్యాంపుకు హాజరు కావాలనుకునే దివ్యాంగులు రంగారెడ్డి జిల్లాకు చెందినవారై ఉండాలని, మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్స్ బుక్ చేసుకొని.. సూచించిన ఆసుపత్రికి రావాలని తెలిపారు. కొండాపూర్ జిల్లా ఆసుపత్రి, వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రిలో క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్యాంపుకు వచ్చే దివ్యాంగులు మీసేవలో స్లాట్ బుక్ చేసుకొని.. రశీదులో సూచించిన సమయానికి ఆసుప్రతికి చేరుకోవాలన్నారు. మీసేవలో స్లాట్ బుకింగ్‌కు సంబంధించి డీఆర్డీఏకు ఎలాంటి ప్రమేయం ఉండదని చెప్పారు. దరఖాస్తుదారులు డాక్టర్లు ఇచ్చిన రిపోర్టుతో పాటు ఆధార్, రేషన్ కార్డులు, ఫొటో తీసుకుని క్యాంపునకు హాజరుకావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తుంకులగడ్డలో కార్డన్ సెర్చ్



స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ, పోలీసులు

పరిగి, ఏప్రిల్ 4: నియోజకవర్గ పరిధిలోని తుంకులగడ్డ, పట్టణ పరిసర ప్రాంతాల్లో గురువారం పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుసిబ్బంది బైక్ లైసెన్స్‌లు, ఆర్సీ బుక్కులు తదితర వివరాలు సేకరించారు. ఎలాంటి పత్రాలు లేని 75బైక్‌లు, మూడు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీఎస్పీ ప్రజలతో మాట్లాడారు. మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తునునాశనం చేసుకోవద్దని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులు

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామంలో గురువారం ముస్లిం సోదరులకు కాంగ్రెస్ పార్టీ కొడంగల్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు తార్యానాయక్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నెల రోజుల పాటు నియమ, నిష్ఠలతో ఉపవాస దీక్షలు చేపట్టడం అభినందనీయమన్నారు. కులమతాలకతీతంగా ప్రతీఒక్కరు సోదరభావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాములు, గ్రామవర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆసిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

రేపు శనైశ్చర స్వామి ఆలయంలో తైలాభిషేకాలు

వికారాబాద్, ఏప్రిల్ 4: శని త్రయోదశి పురస్కరించుకుని ఈనెల 6వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ్ నగర్ డబుల్‌బెడ్ రూమ్ కాలనీ సమీపంలో వెలసిన శ్రీవారాహిదేవి శనైశ్చరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అర్చకులు వినోద్ స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శనైశ్చర స్వామికి తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు, చంద్రమౌళీశ్వర స్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పుస్తెలు, మెట్టెలు అందజేత



వెంకటమ్మ కుటుంబీకులకు పుస్తెలు, మెట్టెలు అందిస్తున్న కౌన్సిలర్ నాగేశ్వర్

పరిగి, ఏప్రిల్ 4: ఆడపడుచు వివాహానికి కౌన్సిలర్ పుస్తెలు, మెట్టెలు అందజేశారు. పరిగి మున్సిపాలిటీలోని 6వ వార్డుకు చెందిన వెంకటమ్మ కూతురు వివాహం నిశ్చయించారు. ఈ విషయం తెలుసుకున్న ఆవార్డు కౌన్సిలర్ బొంబాయి నాగేశ్వర్ వెంకటమ్మ కూతురు వివాహం కోసం పుస్తెలు, మెట్టెలు అందజేశారు. కార్యక్రమంలో ఉడిత్యాల జంగయ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 4: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫైన్ ఆర్ట్స్ పాఠశాల ఎదులాబాద్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ మాధవీలత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-2025 విద్యాసంవత్సరానికి ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలోని 6వ తరగతిలో చేరడానికి ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 18వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హన్‌మాన్ నాయక్, తదితరులు

ఈనెల 12 నుంచి గోర్ బంజారా జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ఆమనగల్లు, ఏప్రిల్ 4 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 12 నుంచి గోర్‌బంజారా జాతీయ స్థాయి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్‌మాన్‌నాయక్ చెప్పారు. గురువారం ఆమనగల్లు మండల కేంద్రంలో టోర్నమెంట్-2024 సెషన్-7కు సంబంధించిన బ్రోచర్‌ను ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడేళ్లుగా సంత్‌సేవాలాల్‌జయంతి ఉత్సవాల సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్‌ను మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ, కర్నాటకకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన ఆటగాళ్లు ఈనెల 10వ తేదీలోగా తమ జట్ల వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు అన్ని వసతులతో పాటు భోజనం, అల్పాహారం కూడా సమకూరుస్తామని తెలిపారు. విజేతలకు మొదటి, ద్వితీయ బహుమతులుగా రూ. 1,00,155, రూ.50.155 నగదు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు 8328213147, 9010822645, 7675937502, 9618999045, 9848830250 నెంబర్లకు ఫోన్ చేసి తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

7న ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష

» జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



వికారాబాద్, ఏప్రిల్ 4: ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి ఈనెల 7వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశం పొందడానికి ఆదివారం ఉదయం 10గంటల నుంచి 12 గంటల వరకు 6వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7, 8, 9, 10వ తరగతులకు సంబంధించి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సంబంధిత మండల కేంద్రాల్లోని ఆదర్శ పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు సంబంధిత పరీక్షా కేంద్రానికి ఒకగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి ప్రవేశపరీక్ష రాసే విద్యార్థులు, ఇన్విజిలేటర్లు, మరే ఇతర సిబ్బంది కూడా సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకుని రాకూడదని తెలిపారు.


కల్యాణానికి హాజరైన భక్తులు

ముగిసిన వేంకటేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన

» కనుల పండువగా స్వామివారి కల్యాణం

తాండూరు రూరల్, ఏప్రిల్ 4: మండలంలోని చెంగోల్‌లో కొనసాగిన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ముగిశాయి. చివరి రోజు యాగశాల బలి పూర్ణాహుతి, మహాకుంభాభిషేకం, శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు మూడు రోజులుగా అంగరంగ వైభవంగా జరిగాయి. అనంతరం స్వామివారి కల్యాణాన్ని అర్చకుడు కిషోర్ పంతులు ఆధ్వర్యంలో కనుల పండువగా సాగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మంజుల, మల్లేశ్వరి, రాజప్పగౌడ్, వడ్డె కృష్ణయ్య, ఇంద్రసేనారెడ్డి, హన్మంతు, నర్సింహులు, నారాయణ రెడ్డి, పులేందర్, వెంకటేశం, గోపాల్‌రెడ్డి, రాము, జయంత్, పండరయ్య, సురేష్, అంజిల్‌రెడ్డి, వెంకటేశం, గోపాల్ రాజ్‌కుమార్ గ్రామస్తులు హనుమయ్య, విజయ్, కృష్ణయ్య, పాల్గొన్నారు.


మృతుడు వివేక్

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

» హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య!

ఆదిభట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో గురువారం జరిగింది. బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కందుకూరు)లో డి.వివేక్(14) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గురువారం హాస్టల్ గదిలో టవల్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి కేసు నమోదు చేశామని ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ శాఖ వైస్‌చైర్మన్‌గా ఎలిజబెత్ రాణి

కీసర, ఏప్రిల్ 4: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబీసీ శాఖ వైస్‌చైర్మన్‌గా ఎలిజబెత్ రాణి నియమితులయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీకి చెందిన మొగులూరి ఎలిజబెత్‌రాణికి గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ ఓబీసీ శాఖ చైర్మన్ అజయ్‌సింగ్ యాదవ్ చేతుల మీదుగా ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ పటిష్ఠతకు తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర ఓబీసీ శాఖ వైస్‌చైర్మన్ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఓబీసీ శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎండి అఫ్జల్‌బేగ్

జనజాతర సభకు భారీగా తరలి రావాలి

కందుకూరు, ఏప్రిల్ 4 : లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా రేపు తుక్కుగూడలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుగబోయే జనజాతర బహిరంగ సభకు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు భారీగా తరలి రావాలని ఆ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎండి అఫ్జల్‌బేగ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుక్కుగూడలోని రాజీవ్‌గాంధీ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గంగుల ప్రభాకర్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్, ఎగిరిశెట్టి నర్సింహ, మదన్‌పాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి షాక్.. కాంగ్రెస్‌లో భారీ చేరికలు

సీఎం సమక్షంలో పార్టీలో చేరిన శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, కందుకూరు జడ్పీటీసీ, తుక్కుగూడ వైస్‌చైర్మెన్


సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

కందుకూరు/మహేశ్వరం, ఏప్రిల్ 4 : కందుకూరులో బీఆర్‌ఎస్ పార్టీకి భారీ షాక్ తలిగింది. మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు, కందుకూరు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డితో పాటు సాయిరెడ్డిగూడ, ధన్నారం, మాదాపురం గ్రామాల మాజీ సర్పంచ్‌లు శ్రీదేవిశేఖర్‌రెడ్డి, మహేష్, మంద సాయిలు, పులిమామిడి ఎంపీటీసీ రాజమ్మ, తుక్కుగూడ మున్సిపల్ వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్, కౌన్సిలర్ తేజస్వీశ్రీకాంత్, తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్దె సురేఖకర్ణాకర్‌రెడ్డిలు కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో తుక్కుగూడలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ మేలో జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ చేవెళ్ల అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపునకు ప్రతీ ఒక్కరు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు కొలన్ విఘ్నేశ్వర్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిర్ర సాయిలు, బీసీసెల్ మండల అధ్యక్షుడు అనేగౌని దామోదర్‌గౌడ్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బాల మల్లేష్‌యాదవ్, సురేష్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. త్వరలో మరి కొందరు చేరుతారని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్, జడ్పీటీసీ

చేవెళ్ల : శంకర్‌పల్లిలో బీఆర్‌ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో శంకర్‌పల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మీప్రవీణ్‌కుమార్, శంకర్‌పల్లి జడ్పీటీసీ గోవిందమ్మగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కౌన్సిలర్లు లక్ష్మమ్మరాంరెడ్డి, శ్వేతపాండురంగారెడ్డి, చంద్రమౌళి, అశోక్, శ్రీనాథ్‌గౌడ్, కో- ఆప్షన్ సభ్యులు రజినిశ్రీనివాస్, మహమూద్, నాయకులు బాలకృష్ణరెడ్డి, రాజేశ్వర్ గౌడ్, రఘునందన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి వారు కాంగ్రెస్ పార్టీలో చేశారు. వారందరికీ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన నేతలంతా ఒక్కసారిగా కాంగ్రెస్‌లో చేరడంతో చేవెళ్ల నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

» చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


మంబాపూర్‌లో విశ్వేశ్వర్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న మహిళలు

పెద్దేముల్, ఏప్రిల్ 4: గ్రామీణ ప్రాంతాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధించాలంటే అది బీజేపీకే సాధ్యమవుతుందని చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండావిశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంబాపూర్, కందనెల్లి, గాజీపూర్, గొట్లపల్లి, అడ్కిచర్ల, తట్టెపల్లి, నాగులపల్లి, గోపాల్‌పూర్, మారెపల్లి గ్రామాల్లో గురువారం ప్రజాఆశీర్వాద యాత్ర కొనసాగింది. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నిస్వార్థంతో దేశసేవ చేస్తున్నారని అన్నారు. స్వార్థ రాజకీయాల నుంచి దేశాన్ని కాపాడేందుకు ప్రధాని మోదీ కుటుంబాన్ని కూడా వదులుకుని పనిచేస్తున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ పాలకులు రాష్ట్రప్రభుత్వాన్ని అప్పులకుప్పగా మార్చారని అన్నారు. ఖజానాలో డబ్బులు లేవంటున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎవరిని మోసం చేయడానికి ఆరుగ్యారంటీ పథకాలను తీసుకువచ్చారని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వ పథకాలతో రాష్ట్రప్రభుత్వాన్ని నడిపిన బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ చేసిందేమీ లేదనడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులూ ఆ విషయం ప్రజలకు ఆ విషయం తెలియనివ్వకుండా ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా జనం మోదీని మూడోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, ప్రధానకార్యదర్శి కృష్ణ, నాయకులు ఉప్పరి రమేష్, బంటారం భద్రేశ్వర్, మండల అధ్యక్షుడు హరీష్‌గౌడ్, సందీప్‌కుమార్, పట్లోళ్ల రవికుమార్ పాల్గొన్నారు.

పార్టీని బొందపెట్టింది మీరే: మాదవరెడ్డి

పూడూరు: టీఆర్‌ఎస్ పార్టీ పేరును బీఆర్‌ఎస్‌గా మార్చుకుని మీ పార్టీని మీరే బొందపెట్టుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలో జిల్లా అధికారప్రతినిధి రవీందర్ కంకల్, నాయకులతో కలిసి గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై వికారాబాద్‌కు వచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణలో మీకు మీరే సమాధులు కట్టుకున్నారనే విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు. రాముడి పేరు ఉన్నన్ని రోజులు బీజేపీ పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో పూడూరు మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు మల్లేష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి డి.వెంకటయ్య, బూత్ అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

చేవెళ్లలో కాషాయ జెండా ఎగరడం ఖాయం

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ నవాబుపేట మండల ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు బీజేపీ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. దేశంలో మోదీ ప్రభంజనం మరోసారి మోగనుందన్నారు. ఈ సందర్భంగా పులుమామిడి ఎంపీటీసీ తేజస్విని తదితరులు ఉన్నారు.

ఎంపీ రంజిత్ రెడ్డిని బీజేపీ తిరస్కరించింది: కేఎస్ రత్నం

వికారాబాద్: ఎంపీ రంజిత్ రెడ్డిని బీజేపీ పార్టీ తిరస్కరిస్తేనే ఆయన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కేఎస్ రత్నం విమర్శించారు. వికారాబాద్‌లోని నాగేష్ గుప్తా గార్డెన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డితో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ అక్రమాల చిట్టా తమ వద్ద ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను ఓడగొట్టేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టింది రంజిత్‌రెడ్డి అని ఇప్పుడు వారి పంచనే చేరి గెలిపించాలని ఎలా కోరుతున్నారని మండిపడ్డారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్థానికుడని ఆయనను భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరాజు, పాంగుగౌడ్, కేపీరాజు, వివేకానందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈటలపై ఓటమి భయంతో బీఆర్‌ఎస్ నేతలు

శామీర్‌పేట: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై గెలువలేమని బీఆర్‌ఎస్ నాయకులు బయపడుతున్నట్లు బీజేపీ మండల సీనియర్ నాయకుడు భవనాసి శ్రీనివాస్ అన్నారు. శామీర్‌పేటలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పై బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లారెడ్డిలు చేసిన అనుచిత వ్యాఖ్యలను భవనాసి శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. మల్కాజ్‌గిరి స్థానం నుంచి ఈటల రాజేందర్‌ను ఎంపిగా అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని మండల బీజేపీ నాయకుడు శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న రాహుల్ శర్మ

అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

» జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఏప్రిల్ 4: నీటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి సమస్యలను పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు సంబంధించి మిషన్ భగీరథ, పంచాయతీ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. బోర్‌వెల్స్, చేతిపంపులు పనిచేయకున్నా, పైపులైన్లు పగిలినా వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో గ్రామాల వారీగా బోర్‌వెల్స్, చేతిపంపుల మరమ్మతులకు సంబంధించి ఎన్ని ఉన్నాయో, వాటికి ఎంత ఖర్చవుతుందనే వివరాలను సమర్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజలకు తాగునీరు అందించడంలో అలసత్వం వహించకూడదన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీరు అనివార్య కారణాలతో నిలిచిపోయినట్లైతే ప్రత్యామ్నాయంగా తాగు నీటిని అందించేందుకు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి అవసరాన్ని బట్టి వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకుని నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాబు శ్రీనివాస్, డివిజనల్ పంచాయతీ అధికారులు సంధ్యారాణి, శంకర్ నాయక్, మిషన్ భగీరథ డీఈలు సుబ్రమణ్యం, రత్నప్రసాద్, శశాంత్ మిశ్రా పాల్గొన్నారు.

ఎటూ తేల్చుకోలేని స్థితిలో మేడ్చల్ ఎంపీపీ


మేడ్చల్ ఎంపీపీ రజిత, రాజమల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 4: కొద్ది రోజులుగా తటస్థంగా ఉన్న బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మేడ్చల్ ఎంపీపీ రజిత, ఆమె భర్త వీర్లపల్లి రాజమల్లా రెడ్డిలు బీఆర్‌ఎస్ వీడనున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం కొనసాగుతున్నది. మేడ్చల్ మండల రాజకీయాల్లో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలం చేసుకున్న ఎంపీపీ రజిత భర్త రాజమల్లారెడ్డిపై బీజేపీ, కాంగ్రెస్‌లు దృష్టి సారించారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డికి అత్యంత సన్నిహితుల్లో ఒకరుగా గుర్తింపు పొందారు. కాగా అసెంబ్లీ ఎన్నికల అనంతరం చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాల కారణంగా చాలా మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్నారు. ఈతంతు పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో మరింత ఊపందుకుంది. దీంతో మేడ్చల్‌లోని చాలా మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్, బీజేపీ కండువాలు కప్పుకుని పార్టీలు మారుతున్నారు. అయినా ఎంపీపీ మాత్రం బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారు. రజిత భర్త రాజమల్లారెడ్డి టీడీపీ నుంచి ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు బీఆర్‌ఎస్‌లో చేరారు. కాగా బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో జిల్లా రైతు సమితి మాజీ అధ్యక్షుడు నందారెడ్డి, మేడ్చల్ జడ్పీటీసీ శైలజ విజయేందర్‌రెడ్డి, పలువురు మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీల గూటికి చేరారు. కాగా ఎంపీపీ మాత్రం పార్టీ మారకుండా తటస్తంగా ఉండిపోయారు.

బీజేపీ, కాంగ్రెస్‌లో రావాలంటూ ప్రయత్నాలు

ఎంపీపీ రజిత భర్త రాజమల్లారెడ్డి ప్రజాదారణ నేతగా గుర్తింపు ఉన్నందున ఆయనను తమ పార్టీలో తీసుకు రావాటానికి బీజేపీ నాయకులు పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే బీజేపీలో చేరిన జిల్లా రైతు సమితి ఉపాధ్యక్షుడు నందారెడ్డి, పలువురు మాజీ సర్పంచ్‌లు తమతో పాటు బీజేపీలో రావాలంటూ రాజమల్లారెడ్డిని కోరుతున్నట్లు తెలిసింది. దీనికి తోడు మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సైతం ప్రతీ రెండు మూడు రోజులకు ఒక సారి రాజమల్లారెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీలో రావాలంటూ కొందరు నేతలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన జడ్పీటీసీ శైలజ విజయేందర్‌రెడ్డి, కొందరు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో రావాలంటూ కోరుతున్నారు. పాత టీడీపీ క్యాడర్ మొత్తం కాంగ్రెస్‌లో చేరితే రాజకీయ భవిష్యత్తు తీర్చిదిద్దుకోవచ్చన్న విషయం పట్ల ఎంపీపీ సన్నిహితులు సూచిస్తున్నట్లు తెలిసింది. ఎంపీపీ రజిత తమ పార్టీలో చేరితే ఆమెతో పాటు మండలంలోని డబీల్‌పూర్ గ్రామంతో పాటు మరో ఎనిమిది గ్రామాల మాజీ సర్పంచ్‌లు, కొందరు ఎంపీటీసీలు తమ పార్టీలో చేరుతారని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో పాటు మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డిలకు ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డికి మధ్య మంచి సంబంధాలు ఉన్నందున ఆయన కాంగ్రెస్‌లో చేరేఅవకాశం లేకపోలేదని కొందరు అంటున్నారు. ఇదిలా ఉండగా రాజమల్లారెడ్డికి రాజకీయ గురువు నందారెడ్డి బీజేపీలో చేరడంతో ఆయనతో పాటు రాజమల్లారెడ్డి కూడా బీజేపీలో చేరవచ్చనే చర్చ కొనసాగుతోంది.

మరమ్మతుకు నోచుకోని రోడ్డు

» టీఎస్‌ఐఐసీ అధికారుల నిర్లక్ష్యం


నజ్దిక్‌సింగారం-మీర్‌ఖాన్‌పేట మధ్య వేసిన మట్టి రోడ్డు

యాచారం, ఏప్రిల్ 4 : టీఎస్‌ఐఐసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా యాచారం మండల కేంద్రం నుంచి కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట వరకు రూ.78 కోట్లతో వేస్తున్న రోడ్డు మరమ్మతుకు నోచుకోవడం లేదు. కారణంగా దుమ్ము, దూళీతో వాహనాదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా మీర్‌ఖాన్‌పేట నుంచి యాచారం వరకు రోడ్డుకు ఇరువైపులా 11 కేవీ, ఎల్టీ లైన్ విద్యుత్ స్తంబాలు 210 రోడ్డుకు ఆనుకొని ఉన్నాయి. రహదారిని నాలుగు లేన్లుగా విస్తరిస్తుండడంతో ఆ స్తంబాలను రోడ్డుకు దూరంగా మార్చాల్సి ఉంది. వాటిని మార్చడం కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు ట్రాన్స్‌కో అధికారుల చేత ఎస్టిమేషన్ వేయించి టీఎస్‌ఐఐసీ ఉన్నతాధికారులకు రెండు నెలల క్రితం సమర్పించారు. కానీ ఆ స్తంబాల తొలగింపునకు నిధులు విడుదల చేయడంలో టీఎస్‌ఐఐసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే రోడ్డు మరమ్మతు పనులు ముందుకు సాగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వెడల్పులో భాగంగా గతంలో ఉన్న బీటీని పూర్తిగా తొలగించి కొత్తగా మట్టి పోసి చదును చేశారు. కానీ స్తంబాలను తొలగించక పోవడంతో రోడ్డును వేయడంలేదు. వర్షం కురిస్తే ఈ దారి గుండా వాహనాలు వెళ్లలేని పరిస్థితి రావడం ఖాయమని వాహనాదారులు వాపోతున్నారు. వేసవిలోనే రోడ్డును బీటీగా మార్చాలని కోరుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే స్తంబాల తొలగింపునకు నిధులు విడుదల చేయడంతో పాటు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని వాహనాదారులు, పాదాచారులు కోరుతున్నారు.

ప్రజాహక్కులను హరించింది బీఆర్‌ఎస్సే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 4: రాష్ట్ర ప్రజల హక్కులను హరించిందని బీఆర్‌ఎస్ పార్టీనే అని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. పరిగిలోని తన నివాసంలో గురువారం రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ నాగరిక ప్రీతంతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈనెల 8వ తేదీన అగ్రనేతలతో జనజాతరసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనజాతర పేరిట 10లక్షల మందితో తుక్కుగూడలో ఈ సభ జరుగుతుందని, ఇట్టిసభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గె, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంకాంధీ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని వివరించారు. ఇదే సభలో ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నీళ్లు, నిధులు నియామకాలు కల్పనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమై అధికారం కోల్పోయిందన్నారు. ఇదిలా ఉంటే కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మారుస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తుందని చెప్పారు. రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ నాగరిక ప్రీతం మాట్లాడుతూ తుక్కుగూడలో నిర్వహించే జన జాతర సభలో ఐదు గ్యారంటీలు ప్రకటించనున్నట్లు తెలిపారు. అన్నివర్గాలకు కాంగ్రెస్ ద్వారానే న్యాయం జరుగుతుందన్నారు. సభకు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలాదిగా తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

పూడూరు: పరిగి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి షాక్ తగిలింది. పలువురు ముఖ్య నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ పరిగి నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు తెలుగు మధుసూదన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో పార్టీలో చేరగా, సీఎం కండువాకప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపునకు కోసం కృషి చేస్తామని మధుసూదన్ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి గాజీపూర్ ఎంపీటీసీ

పెద్దేముల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో గాజీపూర్ ఎంపీటీసీ, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్‌చారి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కార్యకర్తలు పార్టీని బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

శామీర్‌పేట: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని పార్టీ మేడ్చల్ ఏబ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని తూంకుంటలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపడుతున్న ప్రజాసంక్షేమ అభివృద్ధి పథకాలను తెలియజేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయాలని వివరించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ అధిష్ఠానం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని వేసిందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డిలు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీతో పోటీలేదని, బీజేపీతోనే తమకు పోటీ అని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ అవినీతి బయటపడుతోందని, సీఎం సరైన శిక్ష విధిస్తారని వెల్లడించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైఎస్‌గౌడ్, పార్టీ నాయకులు సాయిపేట శ్రీనివాస్, వెంకటేశ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న రాజారత్నం

కేశంపేట ఏప్రిల్ 4 : కేశంపేట మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, ఏడీఏ రాజారత్నం వివిధ గ్రామాల ప్రత్యేకాధికారులు, గ్రామకార్యదర్శులకు సూచించారు. కేశంపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ పైప్ లైన్లను సరి చూసుకోవాలని సూచించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి, ఎంపీవో నర్సింలు, శిరీష పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపాలని ఫిర్యాదు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 4 : ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల ఎదుట విద్యార్థులు ఆడుకునే స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని ఆపాలని జిల్లా కలెక్టర్‌కు గురువారం గ్రామస్థులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 150 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాల ఎదుట కొనసాగిస్తున్న అక్రమ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని ఆపాలని ఎంపీడీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, వారు నోటీసులు ఇచ్చినా సదరు వ్యక్తులు మాత్రం పనులు కొనసాగిస్తున్నారని చెప్పారు. తప్పుడు పత్రాలు సృష్టించి, అనుమతి తీసుకోకుండా నిర్మిస్తున్న పనులను ఆపి, అట్టి స్థలాన్ని పాఠశాలకు చెందేలా చూడాలని గ్రామస్థులు కోరారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



విద్యార్థులకు గైడెన్స్ ఇస్తున్న నిర్మాణ్ సభ్యులు

కేశంపేట, ఏప్రిల్ 4 : పదోతరగతి తరువాత విద్యార్థులకు ఎన్నో అవకాశాలు ఉంటాయని, కెరీర్‌ను మధ్యలో ఆపొద్దని నిర్మాణ్ సంస్థ సభ్యులు పొలిశెట్టి నాగేంద్ర, నరేష్ సుచించారు. కేశంపేట మండలం కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం పెట్టుకుని చదువు కోవాలని సూచించారు. టెన్త్ పదోతరగతి పూర్తయిన తరువాత ఇంటర్‌తో పాటు ఐటీఐ, సెరికల్చర్, పాల్‌టెన్నిక్ సహా ఎన్నో కోర్సులు చదువుకోవచ్చని తెలిపారు. ఉచిత విద్య అవకాశాలు ఉన్నాయని, ఉచిత స్కాలర్ షిప్స్ గురించి చెప్పారు. ప్రభుత్వం కల్పించే ఉచిత విద్య అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శ్రీనివాససాగర్, కృష్ణయ్య, సాయిప్రసాద్, అబ్దుల్ బారీ, సుజాత, శిరీష పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి

పీఏసీఎస్ డైరెక్టర్ అనంతరెడ్డి



చేవెళ్ల, ఏప్రిల్ 3 : రంజిత్‌రెడ్డి చేవెళ్ల ఎంపీగా ఉండి ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పాలని చిన్నగోల్కొండ పీఏసీఎస్ డైరెక్టర్ గుర్రం అనంతరెడ్డి ప్రశ్నించారు. గురువారం చిన్నగోల్కొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఓట్లతో ఎంపీగా గెలిచిన ఆయన కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని చెప్పడాన్ని ఎద్దేవా చేశారు. చిన్నగోల్కొండ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు, విద్యార్థులు భోజనం చేయడానికి షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఐదేళ్లుగా అడిగుతున్నా నయాపైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే ఎన్నికల సమయంలో పార్టీ మారుతారా అని, వచ్చే ఎన్నికల్లో ఆయనను చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. ఆయనను నమ్ముకున్న కార్యకర్తలకు ఏం సమాధానం చెపుతారని అనంతరెడ్డి ప్రశ్నించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

షాబాద్, ఏప్రిల్ 4 : మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు. ఈ మేరకు శ్రవణా నక్షత్రమున హోమాలు, పూర్ణాహుతి, పారాయణాలు, నవగ్రహ ప్రతిష్ఠాపన, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించి, బొడ్రాయికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండ స్వర్ణలతసతీష్, గ్రామస్థులు సంజీవరెడ్డి, ఆర్. మహేందర్‌రెడ్డి, నర్సింహులు, పాల్గొన్నారు.



షాబాద్ : బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

కార్యక్రమంలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, పాండు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, మండల మహిళా అధ్యక్షురాలు వండ్ల మంజుల, బీజేపీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఉన్నారు.

జాలగూడలో..

చేవెళ్ల : చేవెళ్ల మండల పరిధిలోని జాలగూడ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ దాసాంజనేయ స్వామి, పార్వతి జలేశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠాపనను గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ఈ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ నేతలు పాల్గొని స్వామి వార్లను దర్శించుకున్నారు.



చేవెళ్ల : పూజల్లో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు

ఘనంగా ద్వితీయ పుష్కర కుంభాభిషేకం

చేవెళ్ల : చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భువనేశ్వరీ సహిత పంచలింగేశ్వర, నవగ్రహ, పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయ ద్వితీయ పుష్కర కుంభాభిషేకం గురువారం దేవాలయంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలు ఈనెల 6 వరకు కొనసాగుతాయని దేవాలయ కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వార్ల తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



శంషాబాద్ : ఏర్పాటు చేసిన నంది విగ్రహం

శంకర్‌మఠ్ దేవాలయంలో

శంషాబాద్ : శంషాబాద్ పట్టణ కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ శంకర్‌మఠ్ ఆలయంలో నూతనంగా నిర్మించిన శిఖరం, ఏర్పాటు చేసిన నందీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజా మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయంలో గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవచనము, పంచగవ్య, వరుణ, అఖండీపారాధన జరిగాయి. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయం జీవితం

ఆమనగల్లు : ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగేవారు ఆనందమయం జీవితం పొందుతారని జడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ అన్నారు. అందుగుల రంగనాయక స్వామి దేవాలయాన్ని వారు సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలని వారు సూచించారు. పురాతన ఆలయాల పునరుద్ధరణ, దైవ కార్యక్రమాలకు ప్రభుత్వం తోడ్పాటునందించాలన్నారు. నాయకులు లాలయ్యగౌడ్, నిరంజన్, సత్తయ్య పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా జనజాతర సభ

ఆమనగల్లు, ఏప్రిల్ 4 : ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు దేశ ప్రజలంతా కాంగ్రెస్‌తో కలిసిరావాలని, చరిత్రలో నిలిచిపోయేలా తక్కుగూడలో నిర్వహించబోయే జనజాతర సభ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దేశ ప్రజల ఆశలు ఆకాంక్షలకనుగుణంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో విడుదల చేయడం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఏప్రిల్ 6న (రేపు) తుక్కుగూడలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ జనజాతర సభకు ప్రజలు, పార్టీ శ్రేణులు కదిలిరావాలని పిలుపునిచ్చారు. సభ విజయవంతం చేసి మరోమారు కాంగ్రెస్ సత్తాను చాటాలని కోరారు. సభకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేస్తున్నట్లు శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఉపాధ్యక్షుడు కల్లు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు కృష్ణానాయక్, వస్పుల శ్రీశైలం, ఫరీద్, అలీమ్, ఖాదర్ ఖాద్రి, బాల్‌రాం, సురేష్‌నాయక్ పాల్గొన్నారు .



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

మానవత్వాన్ని చాటిన సబితాఇంద్రారెడ్డి

కందుకూరు, ఏప్రిల్ 4 : మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గురువారం మండలంలోని రాచులూరు గ్రామంలో ఓ వివాహానికి హాజరై తిరిగి నగరానికి వెళుతుండగా బైరాగూడ గేటు వద్ద ఓ బైకును గుర్తుతెలియని కారు ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై వెళుతున్న రాచులూరు గ్రామానికి చెందిన కుమ్మరి రమేష్‌కు గాయాలయ్యాయి. ఇది గుర్తించిన ఎమ్మెల్యే తన వాహనాన్ని ఆపి గాయాలైన రమేష్‌కు మంచినీళ్లు తాగించి, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించాక అక్కడ నుంచి వెళ్లిపోయారు.



గాయపడ్డ వ్యక్తిని పరామర్శిస్తున్న సబిత

మరోసారి కేంద్రంలో మోదీ సర్కారే

కేశంపేట, ఏప్రిల్ 4 : మరోసారి కేంద్రంలో మోదీ సర్కారే రానున్నదని బీజేపీ కేశంపేట మండల అధ్యక్షుడు రొల్లు రఘురాములుగౌడ్ జ్యోసం చెప్పారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో బుధవారం రాత్రి పలువురు యువత బీజేపీలో చేరారు. వారికి బీజేపీ కండువా కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. దేశ ప్రజలు మోదీ వైపు చూస్తున్నరని అన్నారు. పాలమూరు బీజేపీ అభ్యర్థి డీకే అరుణను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రకాష్‌గౌడ్, జస్వంత్, జ్ఞానేశ్వర్, శివకుమార్, మహేందర్, గణేష్, హరిజీవన్, కృష్ణ, సాయి, సాయిప్రసాద్, శివ, అరుణ్, దేవేందర్, బన్ని, విష్ణువర్ధన్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మాజీ మండలాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, సురేష్, విఘ్నేశ్వర్ పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాఘురాములు

బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గణేశ్



గణేశ్

మొయినాబాద్, ఏప్రిల్ 4 : బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గణేశ్ కుండేను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ తెలిపారు. గురువారం ఈ మేరకు హైదరాబాద్‌లో ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ పది సంవత్సరాలుగా ఏబీవీపీలో పని చేస్తూ విద్యారంగ సమస్యలపై ఉద్యమాలు నిర్వహించానని చెప్పారు. తనపై ఉన్న నమ్మకంతో బాధ్యతను అప్పగించిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో సామాజిక సమస్యలపై, యువతను జాగృతం చేయడంతో పాటు పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తాని తెలిపారు. గణేశ్‌కు మండల నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్ర కార్యదర్శిగా అశోక్



అశోక్

షాద్‌నగర్‌అర్బన్, ఏప్రిల్ 4 : షాద్‌నగర్ పట్టణానికి చెందిన ప్యాట అశోక్‌కు భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర కమిటీలో స్థానం లభించింది. ఆయనను బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి. మహేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ నాయకుడిగా, యువమోర్చ మండల, జిల్లా స్థాయిల్లో పనిచేసిన అశోక్‌కు రాష్ట్ర స్థాయిలో అవకాశం కల్పించారు. బీజేపీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న తనను గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా నియమించడానికి సహకారం అందించిన బీజేపీ, బీజేవైఎం నాయకులకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయనను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య తదితరులు అభినందించారు.

లీగల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా శ్రీశైలం



శ్రీశైలం

యాచారం, ఏప్రిల్ 4 : బీజేవైఎం లీగల్ సెల్ జిల్లా కన్వీనర్‌గా యాచారం మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన యువ న్యాయవాది పగడాల శ్రీశైలంను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను అంకితభావంతో పని చేస్తూ జిల్లాలో బీజేపీ పార్టీ బలోపేతం కోసం పని చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేస్తానని చెప్పారు.

రాష్ట్ర అధికార ప్రతినిధిగా భగీరథ్



భగీరథ్

కడ్తాల్ , ఏప్రిల్ 4 : బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా కడ్తాల మండల కేంద్రానికి చెందిన కంటేకర్ భగీరథ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. ఏబీవీపీ కడ్తాల మండల అధ్యక్షుడిగా, ఆమనగల్లు భాగ్ కన్వీనర్‌గా, జిల్లా కోకన్వీనర్‌గా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర ఎస్‌ఎఫ్‌డీ కోకన్వీనర్‌గా, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా భగీరథ్ పనిచేశారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి బీజేవైఎం బలోపేతానికి కృషి చేస్తానని భగీరథ్ తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

ప్లాట్లు కబ్జా చేసేందుకు యత్నించిన వ్యక్తులపై కేసు

చేవెళ్ల, ఏప్రిల్ 4 : హెచ్‌ఎండీఏ అనుమతితో ప్లాట్లు కొనుగోలు చేసిన పలువురి ప్లాట్లను కబ్జాచేసేందుకు యత్నించిన నలుగురిపై శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ప్లాట్ల యజమానులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. శంకర్‌పల్లి మండల పరిధి రామంతపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 54, 55, 56లో గల భూమిలో 2011-2012 సంవత్సరంలో చైతన్య కన్‌స్ట్రక్షన్ అనే సంస్థ యాజమాన్యం హెచ్‌ఎండీఏ పర్మిషన్‌తో 340 ప్లాట్లతో వెంచర్ వేశారు. పలువురు వ్యక్తులు ఆ ప్లాట్లు కొనుగోలు చేశారు. కాగా ఆ ప్లాట్లపై కొందరు కన్నేసి కబ్జా చేయడానికి యత్నించారు. ప్లాట్ల యజమానులు వెంచర్ వద్దకు వెళితే వారిని కబ్జాదారులు భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో ప్లాట్ల యజమానులు, గ్రీన్ అవెన్యూ ఓనర్స్ వేల్ఫేర్ కమిటీ అధ్యక్షురాలు జి. రమాదేవి, ఉపాధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతిని కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని శంకర్‌పల్లి పోలీసులను ఆయన ఆదేశించారు. దీంతో శంకర్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేసి కబ్జాకు యత్నించిన ముగ్గురితో పాటు, చైతన్య కన్‌స్ట్రక్షన్స్ యజమాని నాగేశ్వర్‌రావుపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ. మహమ్మద్ అబీబుల్లాఖాన్ స్పష్టం చేశారు. దీంతో ప్లాట్ల యజమానులు సీపీకి ధన్యవాదాలు తెలిపారు.

ఐదుగురు ఐరన్ దొంగల అరెస్టు

● రెండు ట్రైలర్లు, రెండు డీసీఎంల సీజ్

కొందుర్గు, ఏప్రిల్ 4 : పరిశ్రమల యజమానులను, వ్యాపారులను మోసగిస్తూ, అర్థరాత్రి అక్రమంగా ఐరన్‌ను విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు కొందుర్గు ఎస్సై కృష్ణయ్య తెలిపారు. ఐరన్‌లోడ్‌తో ఉన్న రెండు ట్రైలర్ లారీలను, అక్రమంగా ఐరన్‌ను తీసుకువెళ్తున్న రెండు డీసీఎంలను కూడ సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. కొందుర్గు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా శ్రీరంగాపూర్ స్టేజీ వద్ద ఉన్న లక్ష్మీ దాబా వద్ద ఏపీ12వి 2324, ఏపీ28టిఏ 1116 నెంబర్లు ఉన్న రెండు ట్రేలర్లు ఐరన్‌లోడ్‌తో ఆగాయని తెలిపారు. వాటి పక్కనే ఏపీ09ఎక్స్ 6160, ఏపీ22వై 7269 నెంబర్లు గల మరో రెండు డీసీఎంలు ఉన్నట్లు చెప్పారు. వాటి మధ్యలో కొందరు వ్యక్తులు కూడా ఉండడంతో అనుమానం వచ్చి పెట్రోలింగ్ సిబ్బంది వారిని ప్రశ్నించగా అక్రమ ఐరన్ వ్యాపారం బయట పడిందని తెలిపారు. పరిశ్రమల నుంచి వివిధ ప్రాంతాలకు ఐరన్‌ను తీసుకువెళ్తున్న ట్రైలర్ల డ్రైవర్లు సతీష్, సురేష్ అనే వ్యక్తులు అబ్దుల్ అతీక్, శేఖర్, బాకీద్ అనే వ్యక్తులకు అక్రమంగా తమ ట్రైలర్లలోని కొంత ఐరన్‌ను తీసి తక్కువ ధరకు విక్రయిస్తుండగా, దానిని ఈ ముగ్గురు ఇళ్ల నిర్మాణ దారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని స్పష్టమైందని తెలిపారు. కానిస్టేబుల్ శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఇద్దరు ట్రైలరు డ్రైవర్లను, ముగ్గురు ఐరన్ కొనుగోలు దారులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్వోటీ దాడుల్లో గంజాయి పట్టివేత

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 : ఇబ్రహీంపట్నం పట్టణంలోని తిరుమలనగర్‌లో గురువారం రాత్రి ఎస్వోటీ పోలీసులు దాడులు నిర్వహించి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వనస్థలిపురానికి చెందిన మహ్మద్ ఉమర్, ఇబ్రహీంపట్నంకు చెందిన పగడాల నితిన్‌సాయి తిరుమలనగర్‌లో గంజాయితో పట్టుబడ్డారు. వీరి నుంచి ఓ పల్సర్ బైక్, రెండు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.పదివేలు ఉంటుందని పోలీసులు చెప్పారు. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి.

కొందుర్గు, ఏప్రిల్, 4 : కొందుర్గు మండల పరిధిలోని రాంచంద్రాపూర్ అంజనేయస్వామి దేవాలయం వద్ద గురువారం కాంగ్రెస్ ప్రచార రథాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి కోసం ప్రచార రథాన్ని ప్రారంభించామని, మండలంలోని 22 గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. కొందుర్గు మండలంలో పార్టీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ వచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పులుసుమామిడి మాజీ ఉపసర్పంచ్ ఎం నర్సింలు, పర్వతాపూర్ మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం



వన భోజనాలు చేస్తున్న కుటుంబ సభ్యులు

ఆమనగల్లు , ఏప్రిల్ 4 : ఆమనగల్లు పట్టణంతోపాటు మండంలోని పలు గ్రామాల్లో గురువారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కుటుంబసభ్యులతో కలిసి వ్యవసాయ క్షేత్రాలు, చెట్ల కింద సామూహిక భోజనాలు చేశారు. ఉల్లాసంగా గడిపి సందడి చేశారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పాడి పంటలతో విరజిల్లాలని గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ప్రజలు వనమహోత్సవానికి భారీగా తరలివెళ్లారు.

మాడ్గుల : మండలంలోని నల్లచెర్వు, అవురుపల్లి, బ్రాహ్మణపల్లి, మాడ్గుల, ఇర్విన్ గ్రామాల్లో ప్రజలు వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామదేవతలకు జలాభిషేకం చేసి, వనభోజనాలకు వెళ్ళి సామూహిక భోజనాలు చేశారు. చల్లగా చూడాలని గ్రామదేవతలకు గ్రామస్థులు పూజలు చేశారు.

జీవాల సంరక్షణపై చొరవ చూపాలి



డాక్టర్ రేఖ

యాచారం, ఏప్రిల్ 4 : ఎండలు రోజురోజుకు ముదురుతున్నందున మూగజీవాల సంరక్షణపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని యాచారం మండల పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రేఖ రైతులకు సూచించారు. ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి ఆరు వరకు వాటిని మేపాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో మేపితే వడదెబ్బ తగిలే ప్రమాదముందని గుర్తుంచుకోవాలన్నారు. ఆ సమయంలో మేపితే జీర్ణక్రియ సమస్యలు కూడా వస్తాయన్నారు. జీవాలకు పరిశుభ్రమైన నీరు తాగించాలన్నారు. పశువుల పాకకు చల్లటి గాలులు వీచేలా చూసుకోవాలన్నారు. చెట్లకు దగ్గరగా పాకను ఏర్పాటు చేస్తే చల్లటి గాలి వీచి మూగజీవాలకు వడదెబ్బ తగలదన్నారు. పగటిపూట పచ్చటి గ్రాసం తినిపించాలని, రాత్రి వేళ ఎండుగడ్డి మేపాలని చెప్పారు. జీవలు వడదెబ్బతో మరణించే ప్రమాదముందని హెచ్చరించారు. అలా మరణించిన వాటి మాంసం తీసుకోరాదని తెలిపారు. పగటి వేళ నీరు అధికంగా తాగించాలని లేకపోతే వాటి ప్రాణాలకు ముప్పు ఉంటుందని చెప్పారు.

8న సదరం స్లాట్ల బుకింగ్

కేశంపేట, ఏప్రిల్ 4 : అంగవైకల్యం నిర్ధారణకు నిర్వహించే సదరం క్యాంపు స్లాట్లను ఈ నెల 8న(సోమవారం) విడుదల చేయనున్నట్లు కేశంపేట ఏపీఎం భగవంతు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన స్లాట్లను విడుదల చేసేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎల్. శ్రీలత ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సదరం క్యాంపుకు వెళ్లే దివ్యాంగులు మీసేవలో సదరం స్లాట్లను బుక్ చేసుకుని, ఆ రశీదును తీసుకెళ్లాలని సూచించారు. దారఖాస్తుదారులు వారికి కేటాయించిన ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న రమేశ్

పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి సహాయం

ఆమనగల్లు , ఏప్రిల్ 4 : మండల పరిధిలోని మేడిగడ్డ తండాకు చెందిన రాత్లావత్ రమేశ్ ఓ పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి చేయూతనందించారు. ఆ తండాకు చెందిన నేనావత్ రాములు కూతురు వివాహం గురువారం జరిగింది. ఈ సందర్భంగా రమేశ్ రూ. 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. తండాలో పేదింటి ఆడబిడ్డల పెళ్ళిలకు ఆర్థిక సహాయం కొనసాగిస్తానని రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు నందు రాథోడ్, సురేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్నంలో రైతు సత్యాగ్రహ దీక్ష



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4 : ఇబ్రహీంపట్నంలో నేడు (శుక్రవారం) నిర్వహించబోయే రైతు సత్యాగ్రహ దీక్షను జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి కోరారు. గురువారం ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పినందుకు ఈ దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికీ రైతుబంధు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని, రుణాలను మాఫీ చేయలేదన్నారు. ఈ దీక్షలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్ పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు బోసుపల్లి ప్రతాప్, బూడిద నర్సింహారెడ్డి, పాపయ్యగౌడ్, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ ఉన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో

తలకొండపల్లి, ఏప్రిల్ 4 : ఎరువుల దుకాణాల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని, యూరియా, డీఏపీ, ఎంఓపీ నిల్వలను తగినన్ని రైతులకు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజు సూచించారు. తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. దుకాణాల రికార్డులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరలకే ఎరువులు విక్రయించాలని సూచించారు. రైతులకు ఈపాస్ ద్వారా ఎరువులు వి క్రయించాలని తెలిపారు. ఈపాస్‌లో ఉన్న బ్యాలన్స్ ఎరువుల ప్రకారం దుకాణంలో స్టాకు ఉండాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. తలకొండపల్లి మండలంలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఆయనతో ఏఈఓలు, దుకాణ డీలర్లు, తదితరులు ఉన్నారు.